సీజేఐపై దాడి అత్యంత హేయం

- జస్టిస్ గవాయ్‌పై దాడిని ఖండించిన ప్రజాసంఘాలు
- విధులు బహిష్కరించిన న్యాయవాదులు

తెనాలి: భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్‌పై దాడి, రాజ్యాంగంపై జరిగినదాడిగానే పరిగణించాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక సేవాట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ అన్నారు. సేవాట్రస్ట్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ఖండించారు. దేవాలయంవంటి కోర్టు ఆవరణలో ప్రధాన న్యాయమూర్తిపై ఒక న్యాయవాది దాడి యత్నించిన ఘటనపై పోలీసులు ఇంతవరకు ఎఫ్ఐఆర్ నమోదుచేయకపోవటం ఏంటని ప్రశ్నించారు. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. వీరితో షేక్ ఖదీర్, వై.అనిల్, కె.జస్వత్, దేవరకొండ శంకర్, పి.అశోక్, ఉన్నవ సాల్మన్, కె.శివకుమార్, కె.స్వామి, బత్తుల గోపి ఉన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో...

తెనాలి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి దారుణమని బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్‌చార్జి కారుమంచి సునీల్ సందీప్ అన్నారు. భారత రాజ్యాంగానికి న్యాయవ్యవస్థ ప్రధాన స్తంభమని, ఆ వ్యవస్థను భయపెట్టే ప్రయత్నాలు దేశ ప్రజాస్వామ్య ఆత్మను కించపరుస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడికి నిరసనగా మంగళవారం స్థానిక అయితానగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట నినాదాలు చేశారు. సునీల్ సందీప్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదనీ, న్యాయం, సత్యం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై నేరుగా జరిగిన దాడేనన్నారు. బాధ్యులపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల్లోల రాజేష్, బోనిగల ప్రదీన్, ఆరిగ ప్రసాద్, గడ్డటి ప్రకాష్, కంచర్ల సుమంత్, బోనిగల ప్రవీణ్, పిల్లి దాసు పాల్గొన్నారు.


విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు


తెనాలి ఐతానగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీఎస్పీ నాయకులు

సీజేఐపై దాడి గర్హనీయం

తెనాలిరూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడాన్ని తెనాలి బార్ అసోసియేషన్ బృందం తీవ్రంగా ఖండించింది. న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి, కోర్టు భవనాల వెలుపల నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ జరిగిన ఘటనను న్యాయవ్యవస్థపై జరిగిన దాడిగా పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు అన్నం పిన్నారావు, కార్యదర్శి గౌరిశంకర్, కొమ్ము అబ్రహం లింకన్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జునరావు, ఏఏఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీధర్, రవి రాజ్, వేములపల్లి శ్రీనివాస్, అబ్దుల్ ఆరీఫ్, కుటుంబరావు, కె.ప్రకాష్, బెన్‌హర్‌బాబు, బాబురావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత మెగా హెల్త్ క్యాంప్

తెనాలిఅర్బన్/తెనాలి: కేఎస్‌కే విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం ఐతానగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు కళ్యాణ మండపంలో ఉచిత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యశిబిరం జరుగుతుందన్నారు. జనరల్ మెడిసిన్, గైనిక్, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, డెర్మాటాలజీ, పల్మానాలజీ వైద్యులు అందుబాటులో ఉండి సేవలందిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలన



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ సుందరీకరణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. 28వ వార్డులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. వార్డులోని మురుగు కాల్వలను బాగు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలను వేరువేరుగా కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్ యాతాటి అనీల్, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గుమ్మడి ప్రసాద్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆచార్య కృపాచారికి జీవన సాఫల్య పురస్కారం



తెనాలి: పట్టణానికి చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, క్రైస్తవ సాహిత్య పరిశోధకుడు ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన సభలో జీవనసాఫల్య పురస్కారాన్ని స్వీకరించారు. ప్రపంచ అధ్యాపక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్, యునెస్కో సంయుక్తంగా ఈ గౌరవాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. క్రైస్తవ తెలుగు సాహిత్యంలో డాక్టర్ కృపాచారి చేసిన కృషికిగాను దక్కిన ఈ అవార్డును తెలంగాణ రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ ఆనంద్, కో–చైర్మన్ శంకర్ చేతులమీదుగా అందజేశారు.

వంతెనపై నిలిచిపోయిన మినీ లారీ

తెనాలిరూరల్: తెనాలి ఓవర్ బ్రిడ్జిపై మంగళవారం ఉదయం మినీ లారీ నిలిచిపోయింది. మార్కెట్ వంతెన వైపు నుంచి చెంచుపేటవైపు వెళుతున్న లారీ మరమ్మతులకు గురై నిలిచిపోడంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు అరగంట అనంతరం లారీ ముందుకు కదలడంతో వాహన రాకపోకలు కొనసాగాయి.

విద్యార్థులకు మంచి అలవాట్లు నేర్పించండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: విద్యార్థి దశ నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. ఆశాడే వేడుకలను సాలిపేటలోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆహారం తీసుకునే ముందు చేతులను శుభ్రపరుచుకోవాలన్నారు. అలా చేయకపోతే నోటి ద్వారా బ్యాక్టీరియా శరీరంలోకి వెళ్లి వాంతులు, విరేచనలు, డయేరియా వంటివి వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్యాధికారి డాక్టర్ బీవీ కిషోర్ మాట్లాడుతూ గర్భ నిర్ధారణ కిట్‌లను అందుబాటులో ఉంచుకుని అవసరమైన వారికి పరీక్షలు చేయాలని సూచించారు. అనంతరం కొత్తపేటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యులు దేవరపల్లి సుభాష్ రమాదేవి, వేముల ప్రియాంక, హాస్టర్ ప్రిన్సిపాల్ ఈరుగంటి నిరీక్షణరావు, మలేరియా అధికారులు చిరసాని ప్రభాకర్‌రెడ్డి, శ్రీకంత ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, జి.రవికుమార్, డీపీఎంఓ జంగం శ్యామ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సుబ్బరాయణం

ఆశా వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

కొల్లిపర: తమకు ప్రభుత్వం కనీస వేతనం చెల్లించాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, కమ్యూనిటీ వర్కర్స్ ఆశా వర్కర్లుగా మార్పు చేయాలని, 5జీ మొబైల్స్ అందించాలని కోరుతూ మంగళవారం ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం డాక్టర్ నేహకు సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా టీఏ,డీఏలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎం.జయప్రద, ప్రసన్న కుమారి, శివలీల, తిరుపతమ్మ, లంక పద్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

ఎలుకల నిర్మూలనతో దిగుబడులు పెరుగుతాయి

కొల్లిపర: సామూహిక ఎలుకల నిర్మూలనతో వరి పంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని మున్నంగి సర్పంచ్ వేమూరి ధీనమ్మ, ఏఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా రైతులకు అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మున్నంగిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ ఎన్.శ్రీనివాసరెడ్డి రైతులకు బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేసి, వాడే విధానాన్ని వివరించారు. ఉపసర్పంచ్ ఎ.శివనాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో..

తెనాలిటౌన్: ఎలుకల వలన ఆహార ధాన్యం నష్టం ఎక్కువగా జరిగే అవకాశం ఉందని, వాటి నియంత్రణకు జాగ్రత్తలు తీసుకోవాలని తెనాలి ఇన్‌ఛార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.విజయబాబు సూచించారు. సామూహిక ఎలుకల నియంత్రణ కార్యక్రమాన్ని మండలంలోని నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బ్రోమోడయోలిన్ మందును 100 శాతం రాయితీతో సరఫరా చేస్తుందన్నారు. ఏఓ కె.సుధీర్‌బాబు విషపు ఎర తయారీ విధానాన్ని వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రాజవంశీ, నాగరాజు, లావణ్య, హోర్లా సుభోదయ, తదితరులు పాల్గొన్నారు.


రైతులకు ఎలుకల మందు తయారీ విధానాన్ని వివరిస్తున్న ఏఓ శ్రీనివాసరెడ్డి

పరిశోధనలతో సమాజంలో గుర్తింపు

తెనాలిటౌన్: సాహిత్యంలో చేసే పరిశోధనలు ఎన్నో సవాల్‌తో సాగుతాయని, వాటిని పూర్తి చేయగలిగితే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా, నర్సాపూర్‌లోని ఎరమిల్లి నారాయణమూర్తి బీఈడీ కళాశాలలో తెలుగు సాహిత్యం, భాషా బోధన వికాసం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రజ్ఞాచారి శతక సాహిత్యం, భాషా బోధన మనోవికాసం అనే అంశంపై ప్రసంగించారు. అలాగే పరిశోధన పత్రాన్ని కూడా సమర్పించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కళాశాల కరస్పాండెంట్ చేగొండి సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపల్ పిట్టా శాంతి, రెడ్డప్ప, ఆర్.సుబ్బారావు, వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రజ్ఞాచారిని సన్మానిస్తున్న సత్యనారాయణమూర్తి, శాంతి

పని గంటల పెంపును ఉపసంహరించాలని నిరసన

తాడేపల్లి రూరల్: పని గంటల పెంపును ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం తాడేపల్లి రూరల్‌లోని ఉండవల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాజధాని డివిజన్ అధ్యక్షుడు ఎం.రవి మాట్లాడుతూ కార్మికుల ఆరోగ్యాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్ర రాష్ట్రంలో కార్పొరేట్ల మెప్పుకోసం పని గంటలుపెంచి రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు తీరని ద్రోహం చేస్తోందని విమర్శించారు. ఫ్యాక్టరీల చట్టం 1948కి ప్రభుత్వం చేసిన సవరణలు కార్మికులను బానిసలుగా మారుస్తాయని, దీన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. మేడే స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పని గంటలను కార్మిక వర్గం అంతా సంఘటితమై అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

నిలిచిన ఎక్స్‌రే సేవలు.. రోగుల ఇక్కట్లు

తెనాలిఅర్బన్: విద్యుత్ అంతరాయం కారణంగా జిల్లా వైద్యశాలలో సుమారు గంట పాటు ఎక్స్‌రే సేవలు నిలిచిపోయాయి. విద్యుత్‌శాఖ సిబ్బంది మంగళవారం ఉదయం వైద్యశాల రోడ్డులో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్టు కొమ్మలను కొట్టారు. దీంతో వారు విద్యుత్‌ను నిలిపివేయడంతో జిల్లా వైద్యశాలలో ఎక్స్‌రే సేవలు అంతరాయం కలిగినాయి. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సేవలు నిలిచిపోయాయి. ఆ సమయంలో ఎక్స్‌రే కోసం వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

కొమ్మలు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్

తెనాలి: 'ప్రమాదం జరగకముందే మేల్కొనండి' శీర్షికతో మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తాంశానికి స్పందన లభించింది. పట్టణ రామలింగేశ్వరపేటలోని దొడ్డపనేని ఇందిర ప్రాథమిక పాఠశాల ఆవరణ పైభాగంలో గల హైటెన్షన్ విద్యుత్ వైర్ల చుట్టూ పెరిగిన కొమ్మలను సంబంధిత సిబ్బంది అదేరోజు ఉదయం తొలగించారు. స్థానికులు విద్యుత్‌శాఖకు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలియజేశారు.

మత్తు పదార్థాల విక్రయాలు అరికట్టాలి


ఐద్వా పతాక ఆవిష్కరణలో నాయకులు

తాడేపల్లి రూరల్: మద్యం, మత్తు పదార్థాల విక్రయాలను రాష్ట్ర ప్రభుత్వ అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ఐద్వా తాడేపల్లి పట్టణ 6వ మహాసభను కార్యదర్శి గిరిజ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత సంఘ పతాకాన్ని బాలబొమ్మలు విష్కరించారు. అనంతరం మహిళా ఉద్యమ మణిపూస మానికొండ సూర్యవతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస కుమారి మాట్లాడుతూ మతోన్మాదం, ప్రైవేటీకరణ విధానాలతో మహిళలకు భద్రత కరువైందన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న హింస, ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో కుటుంబాలు ఛిద్రమౌతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మద్యం, మత్తు పదార్థాలతో దేశానికి ఉపయోగపడాల్సిన యువశక్తి నిర్వీర్యమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యలను పరిష్కరించాలని, ఇళ్ల పట్టాల కార్యక్రమం వేగవంతం చేయాలని, ఇల్లులేని పేదలకు రెండు సెంట్ల స్థలంఇవ్వాలని, రేషన్ షాపును ఏర్పాటు చేయాలని, మహిళలపై దాడులు, ఆకృత్యాలను అరికట్టాలని, డ్వాక్రాలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించాలని కమిటీ తీర్మానించింది. కార్యక్రమంలో ఐద్వా నాయకులు, కీర్తన, జ్యోతి, భ్రమరాంబ, ఉష తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తీర్పులను అమలుచేయాలి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు అనుకూలంగా కోర్టులు ఇచ్చిన తీర్పులను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని నాయకులు స్టీవెన్, పిచ్చయ్య, సుభాని, సాంబశివరావు, నాగేశ్వరరావులతో కలసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులు గత 308 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్నారని ఇప్పటికైనా కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాల్సిన బాధ్యత యాజమాన్యంపై, ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, దుర్గాభవాని, శివకుమారి, గురవయ్య, ఆశీర్వాదం, శారమ్మ, రమాదేవి, రిబ్కా, సువర్ణకుమారి, కాసమ్మ, అంకయ్య, మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ఎంఈఓ కెన్నడీ



కాకుమాను: నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ప్రాముఖ్యమైనవని ప్రతి విద్యార్థి విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని ఎంఈఓ కె.ఎఫ్. కెన్నడీ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.జీ.ఎఫ్. ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కెన్నడీ మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆయన సూచించారు. ప్రముఖ క్రీడాకారులను స్మరించుకుంటూ వారిని ఆదర్శంగా తీసుకుని క్రీడలలో రాణించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్ క్రీడా పోటీలును నిర్వహించారు. మండలంలోని కొమ్మూరు, బోడిపాలెం, కొండపాటూరు, రేటూరు, గరికపాడు, ఏ.పీ.ఎస్.డబ్ల్యు ఆయా పాఠశాలలోని విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం జీ.వీ.బి. వెంకట్రావు, ఉపాధ్యాయులు,విద్యార్థులుపాల్గొన్నారు.

కట్టుదిట్టమైన భద్రతా చర్యలు



నగరంపాలెం: తుళ్ళూరు, ఉత్తర సబ్ డివిజన్ల పరిధిలో భద్రత పరంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీవో) ఆవరణలోని హాల్‌లో మంగళవారం తుళ్లూరు, ఉత్తర పోలీస్ సబ్ డివిజన్ల పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత తుళ్లూరు, ఉత్తర డీఎస్పీలు సబ్ డివిజన్లలోని పోలీస్‌స్టేషన్లు, శాంతి భద్రతలకు సంబంధించి విషయాలు, నేరాలు, కేసుల వివరాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. వీవీఐపీ, వీఐపీలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాలు ఉన్నాయని, భద్రత ప్రమాణాలను మెరుగుపరచాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల కార్యకలాపాలను నిరోధించేలా ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. . సచివాలయం, హైకోర్టుకు వెళ్లే జడ్జిలు, వీవీఐపీ, వీఐపీల రాకపోకల వేళల్లో ట్రాఫిక్ అంతరాయం లేకుండా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డీఎస్పీలు మురళీకృష్ణ (తుళ్ళూరు), మురళీకృష్ణ (ఉత్తర సబ్ డివిజన్), సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.